28-10-99

# ఎవరికి కఠినం? ఎవరికి సరళం?

**పెట్రోలియం దిగుమతుల బిల్లు పెరుగుతున్నదని వాపోతూ కూడా లెక్కలేనన్ని కొత్త రకాల కార్ల ఉత్పత్తిని దేశంలో ప్రోత్సహిస్తారు. అంతేకాక ఆ కార్ల కంపెనీలకు మంచి మార్కెట్ ఉండగలందులకుగాను కార్ల కొనుగోలుకు విరివిగా అప్పులిచ్చే విధానాలను ప్రభుత్వ బ్యాంకులు అనుసరిస్తాయి. ఒక్క పెట్రోలియం దిగుమతులేకాదు, ధనిక వర్గాల జీవన సౌఖ్యాన్ని పెంచే అనేక దిగుమతులు రోజు రోజుకూ మరింత ఎక్కువ పరిమాణంలో జరుగుతున్నాయి.**



కె.బాలగోపాల్

ఎన్నికల ఫలితాలు ప్రకటించి వారం రోజులు కాలేదు గానీ అప్పుడే ముఖ్యమంత్రి రెండు సార్లు, ప్రధాన మంత్రి రెండు సార్లు 'కఠిన నిర్ణయాలు' తీసుకోవడం తప్పనిసరి అనీ ప్రజలందుకు సిద్ధంగా ఉండాలనీ ప్రకటించారు.

ఎన్నికల ప్రచారమప్పుడు ఈ మాటలెందుకు చెప్పలేదో! 'కఠిన నిర్ణయాలు తీసుకునేవాళ్లనే ఎన్నుకోండి' అని వోట్లెందుకు అడగలేదో.

'కఠిన నిర్ణయాలు' అంటే ఏమిటో దేశంలో అందరికీ అర్థమయిపోయినట్టుంది. 'ఎవరికి కఠినం?' అని ఎవరూ అడగడం లేదు. కఠినమంటే పేదలకూ పీడితులకూ కఠినమనే అర్థమని అందరికీ తెలుసు.

కఠినానికి విరుద్ధమయిన భావన సరళం. సరళీకరణ అన్న మాటకూడా చాలా కాలంగా వింటున్నాం. 'ఎవరికీ సరళం?' అని ఎవరూ అడగడం లేదు. డబ్బు, పెత్తనం ఉన్న వాళ్లకు వాటిని ఉపయోగించుకొని మరింత సంపాదించుకోవడానికి పరిస్థితులను సరళతరం చేయడమే దాని భావమని అందరికీ తెలుసు.

మామూలు వాడుకభాషలో ప్రత్యేకమైన దుర్మార్గపు ధ్వని ఏమీలేని కఠినం — సరళం అనే మాటలకిప్పుడొక రాజకీయ ధ్వని వచ్చింది, భారత రాజ్యం 'కఠినమైన నిర్ణయాలు' తీసుకోలేని 'సాఫ్ట్ స్టేట్ ( SOFT State) అని గున్నార్ మిర్డాల్ కొన్ని దశాబ్దాల క్రితం విమర్శించారు. ఆయన పాపం ఇప్పటంత క్రూరమైన అర్థంలో ఆ విమర్శ చేయలేదు. ఆర్థిక విధాన రచన పేదరికం నిర్మూలన కేంద్ర లక్ష్యంగా కలిగి ఉండాలని నమ్మిన సంక్షేమవాది ఆయన. అయినప్పటికీ భారతరాజ్యం 'కఠినంగా' ఉండలేకపోతున్నదని ఆయన అనడాన్ని వామపక్షవాదులు తీవ్రంగానే విమర్శించారు. ఆయన కఠినం అనే మాటను నిర్విచక్షణగా వాడుతున్నదని అభిశంసించారు.

దేశ దీర్ఘకాల అభివృద్ధినీ సమసమాజ లక్ష్యాన్నీ దృష్టిలో పెట్టుకొని ధనవంతుల విలాసవంతమైన జీవనవిధానాన్ని భారత రాజ్యం అదుపు చేయవలసి ఉండిందనీ అందుకోసం అవసరమైన కఠిన నిర్ణయాలు తీసుకోవలసి ఉండీ తీసుకోలేకపోతున్నదనీ విమర్శించడం ఆయన భావమైతే అది నిజమే కావచ్చును గానీ ప్రజలను అణచివేయడంలో కఠినమైన నిర్ణయాలు తీసుకోలేకపోతున్నదనుకుంటే మాత్రం తప్పని ఆయనను అభిశంసించిన వారు అన్నారు. ఆ వాస్తవాన్ని ఆయన గుర్తించకుండా భారతరాజ్యాన్ని 'సాఫ్ట్ స్టేట్' అనడం వల్ల ఆ రాజ్యం ఆయన ఉద్దేశించిన దిశలో కాక వేరే దిశలో మరింత కఠినంగా తయారు కావడానికి సాధికారత కల్గిస్తున్నాడని కూడా విమర్శించారు.

ఇప్పుడటువంటి అర్థాలు, అపార్థాలు, పెడర్థాలకు తావు లేకుండా 'కఠినం' అనే మాటకు రాజకీయార్థిక భావనలో ఒకే ఒక అర్థం మిగిలింది. పేదలకింక మీదట ప్రభుత్వ భూములు పంచం. వాటిని లాభదాయకంగా —గొర్రెల పెంపకం వ్యాపారం చేపట్టే కార్పొరేషన్లకు పచ్చికబీళ్లుగా, కోళ్లఫారాలకవసరమైన మొక్కజొన్న సాగుకు మెట్టభూమిగా —వాడుకోగల వారికి లీజుకు ఇస్తాం. అప్పుడే 'జాతీయ ఆదాయం' పెరుగుతుంది. కరెంటు ఉత్పత్తికయ్యే ఖర్చు చెల్లించలేని చిన్నాచితకా రైతులకు కరెంటు చవగ్గా ఇవ్వం. ఖర్చు మొత్తం చెల్లించగల పెద్దరైతులకు, అవసరమైతే అంతకంటే ఎక్కువ కూడ చెల్లించగల పారిశ్రామిక పెట్టుబడిదార్లకూ లాభదాయకంగా అమ్ముతాం. అప్పుడే 'జాతీయ ఆదాయం' పెరుగుతుంది. ఆ విధంగా పెరిగిన ఆదాయం చుక్కలు చుక్కలుగా జారి కిందనున్న వారి నోరు కూడా ఎప్పుడో ఒకప్పుడు తడుపుతుంది.

ఎప్పుడు తడుపుతుంది? అసలు తడుపుతుందన్న గ్యారంటీ ఏమిటి? ఈలోపల 'కిందనున్న' వారు గొంతెండి చచ్చిపోతే ఎట్లా? మొదలయిన వెకిలి సందేహాలకు తావు ఇయ్యని వైఖరినే ఇప్పుడు 'కఠినం' అని అభినందనపూర్వకంగా అంటున్నారు. గున్నార్ మిర్డాల్ ఆనాడు భారత రాజ్యం 'కఠిన నిర్ణయాలు' తీసుకోలేకపోతున్నదని విమర్శించడంలో కఠినం అన్న మాటను నిర్విచక్షణగా ప్రయోగించాడన్న విమర్శ వాస్తవమే కావచ్చును గానీ, ఆయన ఆ మాటకు ఇచ్చిన అర్థంలో కఠిన నిర్ణయాలు అంటే ప్రధానంగా ఇవికావు. దేశ సంపదను వృధా చేసి ఆర్థిక వ్యవస్థకు వక్రరూపం ఇస్తున్న ధనవంతుల జీవనశైలిని అదుపుచేసే నిర్ణయాలన్న అర్థంలోనే ప్రధానంగా ఆయన ఆ మాటలు ప్రయోగించారు.

అటువంటి కఠిన నిర్ణయాలు కొన్ని ఇప్పుడు సూచించవచ్చును. సూచించగానే, 'కఠిన నిర్ణయాలు' అన్న మాటను చాలా సార్వత్రికమైన అర్థంలో ప్రయోగిస్తున్నట్టు మాట్లాడుతూనే చాలా ప్రత్యేకమైన అర్థంలో వాడుతున్నారని అర్థం అవుతుంది. ఉదాహరణకు మన విదేశీ చెల్లింపులు లోటులో పడకుండా చూసుకోవడం ఆర్థిక వ్యవస్థ సుస్థిరతకు చాలా అవసరం. [illegible]నికోసమని చెప్పి ఎగుమతులను ప్రోత్సహించడం, నూరుశాతం ఎగుమతుల కోసం ఉత్పత్తి చేసే సంస్థలకు అనేక రాయితీలు ఇవ్వడం, ఎక్స్‌పోర్ట్ ప్రాసెసింగ్ జోన్‌లలలో కార్మిక చట్టాలు వర్తించవన్న 'రాయితీ'కి సహితం సిద్ధపడడం, ఎగుమతులకు తగిన నాణ్యతగల సరకులను ఉత్పత్తి చేసే సామర్థ్యంగల విదేశీ కంపెనీల పెట్టుబడుల దిగుమతిని ఆహ్వానించడం మొదలయిన అనేక చర్యలు చేపడుతున్నారు. కానీ, వీటికి ప్రత్యామ్నాయంగా కొన్ని 'కఠిన నిర్ణయాలు' తీసుకోవచ్చు. మన దిగుమతులలో ప్రధానమైనవి పెట్రోలియం ఉత్పత్తులు, వీటిని తగ్గించే నిర్ణయాలు తేసుకోవచ్చు. దేశంలో కార్ల ఉత్పత్తిని కట్టడి చేయవచ్చు, రెండో మూడో రకాల కార్లకు కార్ల పరిశ్రమను పరిమితం చేసి వాటి సంఖ్యను కూడా పరిమితం చేయవచ్చు, లేదా (కొన్ని దేశాలలో ఉన్నట్టు) కారులో నలుగురికి తక్కువ కాకుండా ప్రయాణం చేయాలన్న నియమం పెట్టవచ్చు. అప్పుడు ఇరుగుపొరుగు కలిసి ఒకే కారులో ప్రయాణం చేయకతప్పదు. ఆమేరకు సగం పెట్రోలు మిగులుతుంది.

ఇది కూడా 'కఠిన' నిర్ణయమే. పేదలకు కఠినంకాదు, కార్ల మోజులో ఒళ్ళు మరిచిపోతున్న ధనిక వర్గానికీ, ఎగువ మధ్య తరగతికీ 'కఠిన' నిర్ణయమవుతుంది. వారికి కఠినమైన ఈ నిర్ణయం తీసుకున్నట్టయితే ఈ మేరకైనా ఎగుమతులకు ప్రోత్సాహమిచ్చే పేరిట పేదలకు కఠినమైన నిర్ణయాలేవైతే తీసుకుంటున్నారో (ఉదాహరణకు ఎక్స్‌పోర్ట్ ప్రాసెసింగ్ జోన్‌లలో కార్మిక చట్టాలు వర్తించవన్న నిర్ణయం) అవి అనవసరం కాగలవు.

ఇటువంటి నిర్ణయాలు చాలా ఉదహరించవచ్చు. విదేశీ పెట్టుబడిని పెద్ద మొత్తంలో ఆకర్షించక తప్పదనీ ఆ పెట్టుబడిని మెప్పించే వాతావరణం కల్పించకతప్పదనీ, అందుకోసం పేదలపైన కొన్ని 'కఠిన నిర్ణయాలు' రుద్దక తప్పదనీ అంటున్నారు. నగరాలను అందంగా తీర్చిదిద్దడం కోసం పేదలను వాళ్ళ పని స్థలాలకు దగ్గరున్న నివాసాల నుండి తొలగించి ఊరిబయట పడేయడం (హైదరాబాద్‌లో మూసీ తీర వాసుల విషయంలో చేస్తున్నట్టు) దీనికొక ఉదాహరణ. దానికి ప్రత్యామ్నాయంగా మన దేశంలోని సంపన్నుల నుండే పెట్టుబడులు సేకరించడానికి 'కఠినమైన' నిర్ణయాలు కొన్ని తీసుకోవచ్చు. ఉదాహరణకు పన్నులెగ్గొట్టే వారిని బుజ్జగించి నలుపును తెలుపు చేసుకునే సదుపాయాలు కల్పించే బదులు రేపిస్టులకూ బాంబులు పట్టుకుని తిరిగే వాళ్ళకూ కఠిన శిక్షలు వేస్తామని బెదిరిస్తున్నట్లు వీరికి కూడా పదేళ్ళో, పదిహేనేళ్ళో జైలు శిక్ష వేస్తామని హెచ్చరించవచ్చు. అటువంటి చట్టాలు సైతం చేయవచ్చు.

ఈ రూపంలో కాకపోతే వేరే ఏ రూపంలోనైనా ధనవంతులకు కఠినమైన నిర్ణయాలు తీసుకోవచ్చు. సమాజ సంపద కొద్ది మంది చేతిలో కేంద్రీకృతం కాకుండా సమాజ ఉమ్మడి ప్రయోజనాల సాధనకు ఉపయోగపడాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏ చట్టం చేసినా చెల్లుతుందని మన రాజ్యాంగం (ఆర్టికల్ 31 —సి ని అనుసరించి) చెపుతుంది. కాబట్టి ఆ లక్ష్యంతో "కఠిన నిర్ణయాలు" తీసుకోవడానికి అడ్డమేమీ లేదు. అటువంటి నిర్ణయమేది తీసుకున్నా విదేశీ పెట్టుబడుల కోసం పేద ప్రజలకు కఠినమైన నిర్ణయాలు తీసుకునే అవసరం ఆ మేరకు తగ్గుతుంది.

అందువల్ల చంద్రబాబు నాయుడైనా, వాజ్‌పేయి అయినా చాలా గంభీరంగా ముఖం పెట్టి కఠిన నిర్ణయాలకు ప్రజలు సిద్ధంగా ఉండాలన్నప్పుడు అవేవో సార్వత్రికంగా కఠినమైనవని అనుకోనవసరం లేదు.

పెట్రోలియం దిగుమతుల బిల్లు పెరుగుతున్నదని వాపోతూ కూడా లెక్కలేనన్ని కొత్త రకాల కార్ల ఉత్పత్తిని దేశంలో ప్రోత్సహిస్తారు. అంతేకాక ఆ కార్ల కంపెనీలకు మంచి మార్కెట్ ఉండగలందులకుగాను కార్ల కొనుగోలుకు విరివిగా అప్పులిచ్చే విధానాలను ప్రభుత్వ బ్యాంకులు అనుసరిస్తాయి.

ఒక్క పెట్రోలియం దిగుమతులేకాదు, ధనిక వర్గాల జీవన సౌఖ్యాన్ని పెంచే అనేక దిగుమతులు రోజు రోజుకూ మరింత ఎక్కువ పరిమాణంలో జరుగుతున్నాయి. వాటిని అదుపు చేసే నిర్ణయాలు మన పాలకులు తీసుకోరు. తీసుకున్నా ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పుకోదు. కాబట్టే ఎగుమతులు పెంచే వ్యూహం మన ఆర్థిక విధానాలకు కేంద్రం అవుతుంది. ప్రపంచ మార్కెట్‌లో నాణ్యమైన సరుకులు అమ్మకానికి పెట్టాలంటే అందుకు తగిన సాంకేతిక జ్ఞానం, మార్కెటింగ్ నైపుణ్యం కావాలి. కాబట్టి ఆ సామర్థ్యం ఉన్న పెట్టుబడిదారీ కంపెనీలను దేశంలోకి ఆహ్వానించడం అవసరం అవుతుంది. ఇది పెట్టుబడి దిగుమతినీ, దానికి అనుబంధంగా ఇతర వస్తు, సేవా దిగుమతులనూ మరింత పెంచుతుంది. కాబట్టి ఎగుమతులను పెంచే వ్యూహం దిగుమతులను పెంచి మరింతగా ఎగుమతులను పెంచే అవసరానికి దారితీస్తుంది. ఈ విషవలయం అనేక 'కఠిన నిర్ణ'యాలకు దారి తీస్తుంది.

మన పాలకులు ఈ రోజు 'భరించక తప్పదు మరి' అంటూ నిస్సహాయత వ్యక్తం చేస్తున్న ఈ నిర్ణయాలకు కారణమైన అర్థరహితమైన విధాన రచనకిదొక మచ్చుతునక మాత్రమే. వేరే కోణాల నుండి వేరే చాలా చెప్పవచ్చు. అయితే ఆ అబద్ధపు నాటకాన్ని ప్రజలకు విడమరిచి చెప్పేవారే కరువయ్యారు. దేశంలోని మేధావులతో అత్యధిక భాగం ఈ నాటకంలో భాగమైపోవడం వల్ల 'పాపం మన పాలకులు ఎన్ని కష్టాలలో ఉన్నారో, దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి కాపాడడానికి ఎంత కష్టమైన నిర్ణయాలు తీసుకుంటున్నారో మనం మధ్యలో పనులు కావాలనీ, తిండి కావాలనీ అల్లరి చేయడం ఏం బాగుంటుంది' అని ప్రజలు తమనోళ్ళు తామే నొక్కేసుకునే స్థితి వచ్చింది.

